క్లుప్తంగా

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న కిషోర్

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాపరిశీలకుడు కిషోర్ అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిశీలకుడు కిషోర్ మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. పుల్లలచెరువు, గంగవరం పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి పాఠశాలల్లో రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రికార్డులు కూడా తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



పెద్దారవీడులో అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణాలు



తరగతి గదుల చుట్టూ పెరిగిన చిల్లకంప

సమస్యల నడుమ కేజీబీవీ

- నిలిచిన ఇంటర్ తరగతి గదుల నిర్మాణాలు
- గదులు చాలక ఇబ్బందులు పడుతున్న బాలికలు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం సమస్యల వలయంలో చిక్కుకుంది. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దాదాపు మూడేళ్లు కావస్తున్నా అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బాలికల కళాశాల నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలకు సర్వశిక్షాభియాన్ ద్వారా రూ.160 లక్షలు నిధులు మంజూరు చేసి 2020లో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్న తరగతి గదుల్లో ఇంటర్మీడియెట్ బాలికలకు విద్యాబోధన కొనసాగుతోంది. గదులు సరిపోవడం లేదని, ఇంటర్మీడియెట్ బాలికల కోసం తరగతి గదులు ఇవ్వడంతో ప్రస్తుతం ఉన్న బాలికలు ఇరుకు గదులతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఎంపీసీ గ్రూపు మొదటి, రెండో సంవత్సరం బాలికలు మొత్తం 70 మంది చదువుతున్నారు. స్లాబ్ లెవల్ వరకు నిర్మాణ పనులు చేసి మిగిలిన పనులు చేయకుండా కాంట్రాక్టర్ నిలిపివేశారు. తరగతి గదులు పూర్తి కాకపోవడంతో ఫిజిక్స్, కెమిస్ట్రీకి సబ్జెక్టులకు సంబంధించిన ల్యాబ్‌లు లేకపోవడంతో విద్య అందని ద్రాక్షగా మిగిలిపోయింది. ఒక గదిలో పరికరాలు అట్టపెట్టెల్లోనే మగ్గుతున్నాయి. తరగతి గదులకు సిమెంటు ఇటుకలతో గోడలు పెట్టి వదిలేశారు. కిటికీలు ఏర్పాటు చేయకుండా స్లాబ్ వేయకుండా వదిలేశారు. దాదాపు రెండేళ్ల నుంచి నిర్మాణ పనులు చేయకుండా కాంట్రాక్టర్ నిలిపివేసినా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ఉపాధ్యాయినులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం చుట్టూ, గదుల్లో పెద్ద చిల్లకంప ఉండటంతో దట్టమైన అడవిని తలపిస్తోంది. దీంతో ముళ్లపొదల్లో విషసర్పాలు, కీటకాలు బెడద ఎక్కువగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనుల ఊసేలేదు. తాగునీటికి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. మరమ్మతులు చేయించక పోవడంతో బోరు నుంచి వచ్చే నీటిని తాగుతున్నామని బాలికలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణం, ముళ్లపొదలను తొలగించాలని, మరమ్మత్తులకు గురైన వాటర్ ప్లాంట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని బాలికలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్



అట్ట పెట్టెల్లో మగ్గుతున్న ల్యాబ్ పరికరాలు



దొనకొండ: జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మకు శుభాకాంక్షలు చెబుతున్న కాకర్ల కృష్ణారెడ్డి

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ జన్మదిన వేడుకలు



తాళ్లూరు: వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న పోశం మధుసూదన్‌రెడ్డి

తాళ్లూరు: ప్రజల కష్టాల్లో ఉంటే అనేక సేవా కార్యాక్రమాలు నిర్వహించడంలో బూచేపల్లి కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని, ప్రతి ఒక్కరూ ఆ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం గుంటి గంగమ్మ దేవస్థానం వద్ద తేజ వయో వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆయన పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. తొలుత మండల నాయకులతో కలిసి కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. తాళ్లూరు, దర్శి పార్టీ అధ్యక్షులు తూము సుబ్బారెడ్డి, వెన్నపూస వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు ఆలోకం హరిబాబు, పులి ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే, మండల రైతు విభాగం, మైనారిటీ సెల్ అధ్యక్షులు గువ్వల శ్రీనివాస రెడ్డి, లతీఫ్ (బబ్బా), మండల కార్యదర్శి భీమిని సుబ్బారావు, నాయకులు సంగు కొండారెడ్డి, నారాయణరెడ్డి, యానం గోపీకృష్ణ పాల్గొన్నారు.



కురిచేడు: వెంకాయమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు కురిచేడు, దొనకొండ మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో వెళ్లి మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చీమకుర్తిలోని ఆమె నివాసనికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కురిచేడు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దొనకొండ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డితో పాటు బత్తుల వెంకట సుబ్బయ్య, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

గణేష్ నవరాత్రులకు సర్వం సిద్ధం



డ్రైవర్లు, వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు

కురిచేడు: గణేష్ చతుర్థి సందర్భంగా మండలంలో గణేష్ మండపాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ప్రజలు పోటీ పడి గణపయ్య విగ్రహాలు తెచ్చి మండపాల్లో సిద్ధం చేశారు. బుధవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో నవరాత్రులు ప్రారంభమవుతాయి. మండల కేంద్రం కురిచేడులో సుమారు 15 విగ్రహాలు ఏర్పాటు చేశారు. డ్రైవర్లు, వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ యోగయ్య మఠంలో గణపతి విగ్రహం ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. అదే క్రమంలో ఈ ఏడాది కూడా ఏర్పాటు చేశారు. మండపాల వద్ద నిత్యం అన్నదానం చేయనున్నారు.

మదర్ థెరిస్సా సేవలు ఆదర్శంగా తీసుకోవాలి

పుల్లలచెరువు: మదర్ థెరిస్సా సేవలు విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్ వాణి అన్నారు. మంగళవారం మదర్ థెరిస్సా జయింతి సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవలు గొప్పవని కొనియాడారు. ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప మహోన్నత వ్యక్తన్నారు.



మదర్ థెరిస్సాకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయినులు

ఖాకీల అరాచకం



దర్శి నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పోలీసులు పక్కాగా అమలు చేస్తున్నారు. పాలకుల మెప్పు కోసం ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి చేష్టలతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలువుతోంది.





ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం

పుల్లలచెరువు: ఉపాధి హామీ పథకం ద్వారా కొందరు రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. మండలంలోని చాపలమడుగు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ తన చేతివాటానికి తెరతీశాడు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు మంజూరు చేయాలంటే ఒక్కో ఐడీకి రూ.5 వేలు వసూలు చేస్తున్నాడని పంచాయతీలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉపాధి హామీ పథకంలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. మండలంలోని కొన్ని పంచాయతీల్లో అనేక సార్లు మొక్కలు తీసుకుని వాటి ద్వారా లబ్ధి భారీగా పొంది మళ్లీ వాటిని పెట్టుకునేందుకు రాష్ట్ర ఉపాధి హామీ కార్యాలయానికి వెళ్లి గతంలో ఉన్న ఐడీలు మార్చుకున్నారని ఆ గ్రామంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆదేమని అడిగే వారు లేరు. అక్రమాలను కట్టడి చేసేవారు లేరు. దీంతో గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌దే హవా సాగుతోంది. అధికారులు విచారణ చేసి గ్రామాల్లో ఎవరైతే పండ్ల మొక్కలు వేసుకుంటారో వారిని నిజమైన లబ్ధిదారులుగా గుర్తించి అక్రమాలకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్



కుక్కలను వాహనంలో ఎక్కిస్తున్న టీం సభ్యులు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలో కుక్కల బెడద అధికం కావడంతో ఒంగోలు స్నేహ ఎనిమల్ కేర్ వారికి ఫిర్యాదు చేసినట్లు కమిషనర్ నారాయణరెడ్డి చెప్పారు. ఈ మేరకు డాగ్ క్యాచింగ్ టీం సభ్యులు వచ్చి 25 కుక్కలను పట్టణంలోని పలు ప్రాంతాల్లో పట్టుకుని ఒంగోలు తరలించినట్లు చెప్పారు. కుక్కలన్నింటికి ఒంగోలులోని కుక్కల సంరక్షణ కేంద్రంలో సంతాన నిరోధక ఆపరేషన్(ఏబీసీ–ఎనిమల్ బర్త్ కంట్రోల్) చేస్తారన్నారు. ఆపరేషన్ అనంతరం కొన్ని రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వాటిని తదుపరి యథావిధిగా అవి పట్టుకున్న ప్రాంతాల్లోనే వదిలేస్తారని నారాయణరెడ్డి చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ వినాయక చవితి శుభాకాంక్షలు

కురిచేడు: మండల ప్రజలకు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఆది దేవుడు గణేశుడు అందరికీ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు ఇవ్వాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆయన ప్రార్థించారు. మండల ప్రజలు గణేష్ నవరాత్రులు సంతోషంగా ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

అరాచకాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దొనకొండ (కురిచేడు): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అరాచకాలకు పాల్పడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకర్ల కృష్ణారెడ్డి విమర్శించారు. నేడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రజలను మభ్య పెడుతూ పాలన కొనసాగిస్తున్నారని, కూటమి నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. మండలంలోని మల్లంపేట, వల్లపునేనిపల్లి, ఎస్సీ కాలనీల్లో మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం దర్శి శాసన సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులపై తప్పుడు కేసులు మోపి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇంటింటికీ తిరిగి బాబు మోసాలు వివరించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేసిన విషయాన్ని కృష్ణారెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దర్శి నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, జిల్లా యాక్టివిటీ సభ్యుడు బత్తుల వెంకట సుబ్బయ్య, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటు పోలయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు వల్లభ రామారావు, మండల యూత్ అధ్యక్షుడు వడ్లమూడి బుజ్జి, వైస్ సర్పంచ్ చింతగుంట్ల నాగార్జున, కిన్నెర ప్రసాద్, మూడమంచు చిన్న యల్లయ్య, దూదేకుల ఇస్మాయిల్, గుమ్మా ఆదినారాయణ, మూడమంచు చిన్న ముసలయ్య, బత్తుల శ్రీను, చింతగుంట్ల స్వామిదాసు, చింతగుంట్ల వెంకటయ్య, చింతగుంట్ల రమేష్, గుమ్మా నడిపి మూర్తయ్య, బత్తుల సురేష్, పొడతరపు పోలయ్య, మూడమంచు సుబ్బమ్మ, పాశం సామ్రాజ్యం, పాశం మల్లేశ్వరి, యర్రగుంట్ల ఆదెమ్మ పాల్గొన్నారు.

దళితుల పెళ్లి సంప్రదాయానికి బ్రేకులు

- ఊరేగింపును అడ్డుకున్న పోలీసులు
- పెళ్లి కుమారుడు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడనే..

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైతే శుభకార్యాలను సైతం పోలీసులు అడ్డుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతిలో పెళ్లిళ్ల ఊరేగింపునకు వెళ్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన పెళ్లి ఊరేగింపును పక్షపాత ధోరణితో పోలీసులు అడ్డుకున్న సంఘటన మండలంలో సోమవారం రాత్రి వెలుగు చూసింది. మండలంలోని వెలుగువారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన గన్నేపూడి వినయ్‌కుమార్ (జిన్నా) సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకుంటున్నాడు. అందులో భాగంగా కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి డీజేతో ఊరేగింపుగా సర్పంచ్ ముచ్చుమారి కోటేశ్వరమ్మ బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి నివాసానికి బయల్దేరారు. దళితుల పెళ్లికి ఆభరణాలు బహూకరించడం గ్రామంలో ఉన్న అగ్రకులాల సంప్రదాయం. పెళ్లి కుమారుడు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు కావడంతో స్థానిక తెలుగు తమ్ముళ్లు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన వచ్చి అనుమతి లేకుండా పెళ్లి ఊరేగింపు చేసుకునేందుకు వీల్లేదని అడ్డుకున్నారు. డీజే బాక్సులను స్వాధీనం చేసుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వివాహాలపై కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటంపై స్థానికంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.